‘తల్లికి వందనం’ కోసం ఎదురు చూపులు

- ఫీజుల కోసం వత్తిడి చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు
- ప్రతి బిడ్డకూ కాదు.. ప్రతి తల్లికీ రూ.15 వేలు
- తల్లికి వందనం పథకం మార్గదర్శకాల విడుదల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో బడి మానేయకూడదని, వారికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టింది. ప్రభుత్వం పాటు క్రమం తప్పకుండా పథకాన్ని అమలు చేసింది. నేరుగా తల్లుల ఖాతాలోనే నగదు జమ చేసింది. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు అమ్మ ఒడి పథకాన్ని కొనసాగిస్తామని, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి పథకం పేరు మార్చారు. తల్లికి వందనం పేరిట ప్రభుత్వం జీవో జారీ చేసింది. జీవోలో తల్లికి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ పథకం అమలుపై పేదింటి తల్లులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.



కూటమి మ్యానిఫెస్టోలో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్న తల్లికి వందనం హామీ(సర్కిల్‌లో)

66 వేల మంది విద్యార్థులు..

చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కొందరు పేదలు ఆర్థికంగా భారమైనప్పటికీ తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు అవుతోంది. ప్రైవేటు పాఠశాలలు టర్మ్ ఫీజుల పేరుతో విద్యార్థులను వత్తిడి చేయడం ప్రారంభించాయి. దీంతో తల్లిదండ్రులు తల్లికి వందనం పథకం ద్వారా ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు? విధి విధానాలు ఏమిటి? ఎంత మంది పిల్లలకు వర్తింప జేస్తారు? అన్న సందేహాలు విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నాయి. ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు తమకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున ఆర్థిక సహాయం అందుతుందని ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువునే విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించింది. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో 28,834 మంది ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ప్రస్తుతం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ వంటి వివిధ యాజమాన్యాల పాఠశాలల్లో సుమారు 66 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 80 శాతానికి పైగా పేదలే ఉన్నారు. ప్రభుత్వం హామీ మేరకు జీవో జారీ చేసింది. కానీ పథకం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందో అందులో పేర్కొనలేదు. ప్రభుత్వం వీలైనంత త్వరగా పథకం విధి విధానాలు రూపొందించి అమలు చేయాలని పేద విద్యార్థుల తల్లులు కోరుతున్నారు.

నిబంధనలు లేకుండా పథకం ఇవ్వాలి..



రాష్ట్ర ప్రభుత్వం పిల్లల చదువుల నిమిత్తం తల్లుల బ్యాంక్ ఖాతాలో తల్లికి వందనం పేరుతో జమ చేస్తానని చెప్పిన ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నాను. మా అమ్మాయి ప్రైవేటు స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం అమలు చేయాలి.

– చిన్ని అమ్ములు, వాంబే కాలనీ

ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించాం..



నాకు ఇద్దరు పిల్లలు. తల్లికి వందనం వస్తుందనే హామీతో మేము ఇద్దరు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నాం. మాకు వచ్చే ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. దీంతో ఫీజులు చెల్లించటానికి ఇబ్బందులు పడతున్నాం. మా పిల్లలకు తల్లికి వందనం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాం.

-బి.ఉషారాణి, మధురానగర్

అందరికీ తల్లికి వందనం ఇవ్వాలి..



మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురు పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నాం. ప్రభుత్వం తల్లికి వందనం ఇస్తుందనే ఆశగా ఎదురు చూస్తున్నాం. ముగ్గురికీ ఫీజులు చెల్లించటం కష్టంగా ఉంది. ఎన్నికలకు ముందు ప్రభుత్వం చెప్పిన విధంగా మా ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలి..

-ఎస్‌కే సహేనా, పసుపుతోట

ఆర్థిక సమస్యల నుంచి బయటపడతాం..



మాకు వచ్చే ఆదాయం అంతంత మాత్రం. మాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరు పిల్లలను నవోదయ స్కూల్‌లో చదివిస్తున్నాం. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా మా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలి. ఆ నగదుతో ఆర్థిక సమస్యల నుంచి బయటపడతామని ఎదురు చూస్తున్నాం.

- బి.శకుంతల, నేతాజీ కాలనీ

తల్లికి వందనం పథకంతో తోడ్పాటు



మాకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు పిల్లలు తూనుగుంట్ల రమాదేవి నగరపాలకసంస్థ పాఠశాలలోను ఒకరు ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలోను చదువుతున్నారు. తల్లికి వందనం పథకం మాకు తోడ్పాటు ఇస్తుంది. ముగ్గురి పిల్లలకు తల్లికి వందనం ఎప్పుడు వేస్తారా అని ఎదురు చూస్తున్నాం.

-జి.వెంకట లక్ష్మి, మధురానగర్

క్లుప్తంగా

టైలర్స్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టైలర్స్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావుకు ఏపీ టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ సహకార సంఘాల సమాఖ్య ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సమాఖ్య ప్రతినిధులు ఎమ్మెల్యే బొండా ఉమాను గురువారం కలిశారు. టైలర్స్ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా యాక్స్ టైలర్స్ అధినేత, ఎన్టీఆర్ కాస్ట్యూమ్ డిజైనర్ యర్రంశెట్టి వాలేశ్వరరావు ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కల్యాణ్, నాయకులు కొండల రాజు, కనకదుర్గ, కొండ తదితరులు ఉన్నారు.

17న దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో తొలి ఏకాదశి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 17వ తేదీ బుధవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు అలంకరణ సేవ జరుగుతాయన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి 11 సార్లు విష్ణు సహస్ర నామ పారాయణం, తులసి అర్చన నిర్వహిస్తామన్నారు. భక్తులు తొలి ఏకాదశి పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

నాగమానసాదేవికి ప్రత్యేక పూజలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆషాఢ మాసం పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో గురువారం ప్రత్యేక పూజల నిర్వహించారు. భక్తులు నాగమానసాదేవి అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళా భక్తులు సమర్పించిన గాజులు అమ్మవారికి అలంకరించారు. పసుపు, కుంకుమతో పండ్లు, పూలు సమర్పించి అమ్మవారిని కొలిచారు. సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం



లబ్బీపేట(విజయవాడతూర్పు): రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ నూతన అధ్యక్షురాలు కంతేటి సంధ్యారాణి అన్నారు. నగరంలోని విధార హోటల్‌లో గురువారం ఇన్నర్ విల్ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఉషస్సు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షురాలుగా కంతేటి సంధ్యారాణి, కార్యదర్శిగా కె.భవానీ బాధ్యతలు స్వీకరించారు. పూర్వ అధ్యక్ష కార్యదర్శులు కె.హరిత చౌదరి, జీ సరస్వతిలు నూతన అధ్యక్ష కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. విజయవాడ ఇన్నర్ వీల్ మిడ్ టౌన్ క్లబ్ అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించటం తనకెంతో గర్వంగా ఉందని సంధ్య తెలిపారు. శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకు ఇన్నర్ వీల్‌కు 37 క్లబ్ ఉన్నాయని, తాను 18వ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. అందరి సహకరంతో క్లబ్‌ను విజయవంతంగా నడిపిస్తామని సంధ్య ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమానికి జిల్లా చైర్ పర్సన్ ఏ.లక్ష్మీశ్రీనివాస్, కార్యదర్శి డి.సావిత్రి, పీడీసీ యశోదా పాటిబండ్ల, పలువురు ప్రముఖులు, విజయవాడ మిడ్ టౌన్ సభ్యులు పాల్గొన్నారు.

14న ఉచిత వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రభ కాలనీ నందమూరినగర్‌లో ఫ్యామిలీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ సైరాభాను పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అందులో భాగంగా సీబీసీ, షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన వారికి ఈసీజీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రజనీకాంత్‌శర్మ కోరారు.

తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించండి

వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఏ. మహేష్

పటమట(విజయవాడతూర్పు): నగర వాసులకు తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్య లేకుండా అధికారులు ప్రతి నిత్యం పర్యవేక్షించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఏ మహేష్ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఆయన చిట్టినగర్ బూస్టర్ పంప్ హౌస్, కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్, 56వ డివిజన్, ఏపీ ఐఐసీ కాలనీ లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. చిట్టినగర్‌లోని బూస్టర్ పంప్‌ను పరిశీలించి, నీటి సరఫరా అవుతున్న కనెక్షన్లు, కొండ ప్రాంతాల్లో లీకేజీ సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్‌లో నీటి శుద్ధిలో తీసుకుంటున్న జాగ్రత్తలు, సరఫరాలో ఎదురయ్యే సమస్యలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. 56వ డివిజన్‌లో ఇంటింటిలో నీటి సమూనాలను సేకరించి క్లోరిన్ పరీక్షలను నిర్వహించారు. నీటి సరఫరా చేసే ప్రాంతాల్లో తాగునీటి కలుషితం లేకుండా నిరంతరం పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు పటిష్టంగా పర్యవేక్షణ చేస్తూ సైడ్ డ్రెయిన్లలో తాగునీటి పైపులు కలవకుండా అసిస్టెంట్ ఇంజినీర్లు జూలై 20వ తేదీ నాటికి వాటిని గుర్తించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటి నుంచి ఏఈ, డీఈ స్థాయిలో నమూనాలను సేకరించాలని, సేకరించిన నీటి నమూనాల పరీక్షలను సీఈ ధ్రువీకరించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యిన తర్వాత డ్రెయిన్లలో తాగునీటి పైపులైన్లు కనిపిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన ఏపీఐఐసీ కాలనీలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వాహణ ఎప్పటికప్పుడు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు సిల్టును తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ -1 ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ -1 డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


నీటి నమూనాలను పరిశీలిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ మహేష్

ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారించండి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువతరం ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి, ప్రమాదాలను నివారించాలని విజయవాడ పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ(ట్రాఫిక్) డి.ప్రసాద్ తెలిపారు. విజయవాడ సిటీ పోలీసు, కాకరపర్తి భావనారాయణ కళాశాల, మండల న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీసీపీ ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువత అత్యధికంగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతుందన్నారు. యువత ట్రాఫిక్ రూల్స్‌ను పక్కనపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించటం వలన తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువకులే అత్యధికంగా ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. దానివలన ఆ కుటుంబంలోని తల్లిదండ్రుల మనోవ్యధను ఎవరూ తీర్చలేరన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలన్నారు. తప్పనిసరిగా నాణ్యత కలిగిన హెల్మెట్‌ను వినియోగించాలన్నారు. హెల్మెట్ వాడకపోవటం వలన సగానికి పైగా మరణాలు సంభవిస్తున్నాయని గుర్తు చేశారు.

చట్టాలు మరింత కట్టుదిట్టం..

మండల లీగల్ సర్వీసెస్ కమిటీ లీగల్ సర్వీసెస్ ఆఫీసర్ పి.రాము మాట్లాడుతూ.. మోటారు వెహికల్‌కు సంబంధించి నూతన చట్టాలను మరింత కట్టుదిట్టం చేశారన్నారు. నిబంధనలను ఉల్లంఘించి చట్టాలను అతిక్రమిస్తే భారీ జరిమానాలను విధిస్తామన్నారు. ఏసీపీ వెస్ట్(ట్రాఫిక్) బి.జనార్దనరావు మాట్లాడుతూ విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను పాటించటం ద్వారా సమాజానికి మేలు చేసినవారవుతారన్నారు. నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అధ్యక్షత వహించారు. ట్రాఫిక్ సీఐలు బి.వెంకటేశ్వరరావు, ఆర్.సూర్యభాస్కర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ఎస్.సాంబశివరావు, డి.పవన్‌కుమార్, కల్మాబేగం, ఎన్‌సీసీ ఆఫీసర్ టి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీసీపీ ప్రసాద్

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామని, గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పించామని 30వ డివిజన్ కార్పొరేటర్ బి.జానారెడ్డి అన్నారు. స్థానిక 30వ డివిజన్ జీవీఆర్‌నగర్ దావు బుచ్చయ్యకాలనీ మెయిన్ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కోట్లాది రూపాయల వ్యయంతో ఎన్నికలకు ముందే అంతర్గత రోడ్డు పనులను పూర్తి చేశామన్నారు. ఇప్పుడు మిగిలిన మెయిన్ రోడ్డు పనులు పూర్తి చేస్తున్నామని తెలిపారు. 30వ డివిజన్ చిరకాల సమస్యగా ఉండిపోయిన మెయిన్ రోడ్డు పనులు పూర్తికావటం పట్ల సంతోషంగా ఉందని తెలిపారు. సాధ్యమైనంత త్వరలోనే యూజీడీ, వాటర్ ట్యాంక్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. మెయిన్ రోడ్డుతో పాటు ప్రధాన రద్దీ రోడ్ల వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులు, వార్డు సచివాలయం ఎమినిటీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.


జీవీఆర్ నగర్ మెయిన్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి


క్యాన్సర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌కు చెందిన రిక్షా పుల్లర్ మనమరాలు కాన్సర్ వ్యాధితో బాధ పడుతున్న దృష్ట్యా చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావు చేతుల మీదుగా గురువారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మధురానగర్ కొబ్బరితోటకు చెందిన నారాయణ మనమరాలు(7) బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. దీంతో సమాచారం అందుకున్న టీడీపీ నాయకుడు బర్మా శ్రీనివాస్ నారాయణ ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆయన రూ.10 వేలు నగదును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. బర్మా శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్నారి చికిత్స నిమిత్తం సాయం చేసే దాతలు ముందుకు రావాలని కోరారు.


నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ చెప్పారు. ఆ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో కంప్యూటర్స్ విద్యార్థులకు ఐఓటీ అంశంలో ప్రాజెక్ట్‌లపై మూడు వారాల పాటు జరిగే వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌ను ప్రారంభించిన చిట్టా అమర్ సుధీర్ మాట్లాడుతూ కంప్యూటర్స్ రంగంలో విప్లవాత్మకమైన అభివృద్ధి కొనసాగుతుందన్నారు. అనేక గొప్ప ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అందులో భాగంగా ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో చాలా వేగవంతమైన ప్రగతి చోటు చేసుకుంటుందన్నారు. ఆ రంగంలో విద్యార్థులు మరింత పట్టు సాధించాలని చెప్పారు. ఆ దిశగా ఈ వర్క్‌షాప్ తోడ్పడుతుందన్నారు. ఎడ్యునో రోబోట్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి రాఘవయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, విభాగాధిపతులు పి.శిల్ప, ఎన్.మహాలక్ష్మి, డాక్టర్ దుర్గాప్రసాద్ డాక్టర్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్స్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు

వీఎంసీ నైట్ షెల్టర్ల నిర్వహణకు దరఖాస్తు చేసుకోండి


పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు, ఫుట్‌పాత్‌లలో నిద్రించే వారికి ఆశ్రయం కల్పించే క్రమంలో నైట్ షెల్టర్ హౌస్‌ను నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్లు వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్టరైన స్థానిక ఎన్జీవోలు, ఎస్‌వోలు నిరాశ్రయ సమష్టి సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, స్వయం సహాయక సమాఖ్యలు, ఉమెన్ అండ్ యూత్ కమ్యూనిటీ బెస్ట్ గ్రూపులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, ప్రైవేటు సెక్టార్ కంపెనీలు, అసోసియేషన్‌లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హనుమాన్‌పేట, సితార సెంటర్, రాణిగారితోట సిమెంట్ గోడౌన్ వద్ద షెల్టర్లు నిర్దేశించిన నిబంధనల ప్రకారం షెల్టర్‌లు నిర్వహించేందుకు పూర్తి అనుభవమున్న సంస్థలు ఈ నెల 23వ తేదీ లోపు పట్టణ సామాజికాభివృద్ధి విభాగం అధికారిని సంప్రదించి దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు.

నూర్‌బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా కాశింబీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ నూర్ బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ పెద్ద కాశింబీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మైలవరం నియోజకవర్గానికి చెందిన తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీకి కృతజ్ఞతలు తెలిపారు. నూర్ బాషా సామాజికవర్గానికి చెందిన ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి నూర్ బాషా సామాజిక వర్గానికి చెందిన మహిళల సమస్యలను తెలుసుకుని అధ్యక్షుడి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జ్ డి.హుస్సేన్ ఆమెను అభినందించారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జలదూత్ క్యాంపెయిన్-2024 కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీను ప్రాంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో నీరు అత్యంత విలువైనదని, దానిని కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే నీటి ప్రాధాన్యతను గుర్తించాలని సూచించారు. నీటి వృధాను అరికట్టటంతో పాటు వర్షపునీటిని వినియోగించుకునేలా చర్యలుతీసుకోవాలన్నారు. అనంతరం వర్షపునీటిని కాపాడుకోవాలని నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కేవీఎస్ ప్రసాద్, సురేష్, మల్యాద్రి, బీబీ, లక్ష్మీజానకి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్య నగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ మహిళలు గురువారం దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. అపార్ట్‌మెంట్ వద్ద మహిళలు పూజలు చేసి మేళతాళాలు డప్పు వాయిద్యాలతో పసుపు, కుంకుమ, గాజులు, పిండి వంటలు, పండ్లు చేతబూని ఇంద్రకీలాద్రికి వెళ్లి సారె అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వర శర్మ మాట్లాడుతూ.. రాష్ట్రం సర్వతోముఖ అభివృద్ధిని సాధించాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ సారె సమర్పించామన్నారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు సాంబశివరాజు, మాచిరాజు శ్రీనివాస్, వసంత, శైలజ, అరుణ, లీలాకుమారి, పావని, సునీత తదితరులు పాల్గొన్నారు.

లయోలాలో ఘనంగా మ్యాగ్నలైట్ 2కే24

గుణదల(విజయవాడతూర్పు): ఆంధ్రా లయోలా కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ‘మ్యాగ్నలైట్ 2కే24’ రెండు రోజుల జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోటల్ హయత్ ప్లేస్ మేనేజింగ్ డైరెక్టర్ సాయి కార్తీక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి కార్తీక్ మాట్లాడుతూ.. కష్టపడే మనస్తత్వం ఉంటే ఎంతటి విజయమైన సాధించగలమన్నారు. తాను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి సాధించిన విజయం గురించి విద్యార్థులకు వివరించారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలో ఉద్యోగం నుంచి దేశంలో తన సొంత వ్యవస్థాపక సంస్థ వరకు తన ప్రయాణాన్ని క్లుప్తంగా తెలిపారు. తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఎన్ని సవాళ్లు ఎదురైన వెనకడుగు వేయకూడదన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ ఎం.సగయరాజ్, పీజీ డిపార్టుమెంట్ వైస్ ప్రిన్సిపాల్ కె.ఎం.ప్రభుదాస్, ఎంబీఏ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని కార్పొరేటర్ వీరమాచనేని లలిత సూచించారు. స్థానిక 28వ డివిజన్ శ్రీనగర్ వాటర్ ట్యాంక్ వద్ద గురువారం మహిళా గ్రూపు సభ్యుల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఒక మహిళ ఆర్థికంగా స్థిరపడితే ఆ కుటుంబం మొత్తం బాగుంటుందన్నారు. నగరపాలకసంస్థ సీడీఓ జగదీశ్వరి మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని వినియోగించుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు మహిళలు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు బాబాకు పంచామృత అభిషేకం అర్చనలు నిర్వహించారు. దాత తంగెళ్లమూడి పార్థనాగసాయి కుమార్ దంపతుల సహకారంతో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 500 మంది భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది.